క్లుప్తంగా

ఘనంగా వారాహిదేవి నవరాత్రోత్సవాలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఐఎస్ఎఫ్ క్యాంప్ ఆవరణలో గల రాజమాతాదేవి ఆలయంలో వారాహిదేవి నవరాత్రోత్సవాలు ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన శనివారం ఆలయం వద్ద అర్చకులు దామోదరచార్యులు ప్రత్యేక శాంతి హోమం నిర్వహించారు. సాదు ల వాసుదేవ్–వరలక్ష్మి, రాపెల్లి రాజమౌళి–భాగ్యలక్ష్మి, సబ్బు రాజేశం–రాజేశ్వరి దంపతులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి వచ్చే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల పట్టణ ట్రాఫిక్ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాలకు వచ్చే వాహనదారులు నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే, వారి తల్లిదండ్రులను చట్టప్రకారం శిక్షించనున్నట్లు, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు.

నేడు ఆటో యూనియన్ ఎన్నిక

మందమర్రిరూరల్: మందమర్రి ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఎన్నిక స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించనున్నట్లు యూనియన్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ ఎన్నికలకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముకేష్‌గౌడ్ హాజరవుతారని ఓటర్లు ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలని కోరారు.

డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రకాశం

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు న్యాయవాది రెడ్డిమల్ల ప్రకాశం మ్యాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఎంబీర్ ఆధ్వర్యంలో అందజేస్తున్న డాక్టరేట్ పట్టాను శనివారం ఢిల్లీలో అందుకున్నారు. వయోజన విద్య, విద్యా రంగంలో పలు సేవలను అందిస్తూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతూ సామాజిక చైతన్యం చేస్తున్నందుకు అవార్డు లభించినట్లు తెలిపారు. ఢిల్లీలో నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీతను పలువురు అభినందించారు.

ఖర్జీభీంపూర్‌లో 'పల్లెనిద్ర'



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి భీమిని పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలపై ఎస్సై విజయ్‌కుమార్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై గంగారాం

భీమిని: మహిళల రక్షణ, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై కన్నెపల్లి గంగారాం కేజీబీవీ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ ద్వారా జరిగే మోసాలు, వేధింపులకు గురికాకుండా ఉండేందుకు సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల రక్షణ కోసం ఇతర సమస్యలపై 100, 181, సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి వినిత, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలం బల్దియాది.. సొమ్ము ప్రైవేటు వ్యక్తులకు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న కోడిగుడ్ల దుకాణం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలోనిది. బల్దియా షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తుకు వెళ్లేందుకు నిర్మించిన మెట్ల కింద ఉన్న ఖాళీ స్థలాన్ని ఇలా గదిలా మార్చారు. షెటర్ ఏర్పాటు చేసి ఓ ప్రైవేటు వ్యక్తికి నెలకు రూ.20 వేలకు అద్దెకు ఇచ్చారు. ఇది అక్రమ నిర్మాణమని బల్దియా అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. గదిని స్వాధీనం చేసుకోవడం లేదు.

- మంచిర్యాల మున్సిపల్ స్థలంలో అక్రమంగా టేలాలు
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఆదాయం
- ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ తీర్మానం
- అయినా చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- ఆదాయాన్ని కోల్పోతున్న మున్సిపాలిటీ



మార్కెట్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకుని ఏర్పాటు చేసిన టేలాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ జిల్లా కేంద్రంగా మారడంతో ఇక్కడ వ్యాపారం వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో గజం స్థలాన్ని కూడా వదలకుండా వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. ఇక కొందరు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు రోడ్ల పక్కన ఉన్న మున్సిపల్ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే టేలాలు, దుకాణాలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు అద్దెకిస్తున్నారు. బల్దియాలో ఖజానాలో జమ కావాల్సిన నిధులు ఆక్రమణదారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. ఇదంతా మున్సిపల్ అధికారులకు తెలిసినా, వాటిని తొలగించేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

అంతా 'మామూలే'

మున్సిపల్‌లోని రెవెన్యూ విభాగానికి చెందిన ఉద్యోగులు ఆక్రమణలను నియంత్రించాలి. కానీ, ఆక్రమణదారుల నుంచి నెలనెలా డబ్బులు తీసుకుని అంతా 'మామూలే' అన్నట్లుగా చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆక్రమణదారులకు ఇవి కాసులు కురిపిస్తున్నాయి. రూ.5 వేలకు తక్కువ కాకుండా నెలనెలా అద్దె వసూలు చేస్తున్నారు. ఇలా ఆక్రమణ దారులకు చిరు వ్యాపారులు నెలకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. వాస్తవానికి ఈ ఆదాయం బల్దియా ఖజానాలో జమ కావాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ సొమ్ము ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి చేరుతోంది. అయినా వాటిని తొలగించాలని గానీ, వాటి నుంచి అద్దె వసూలు చేయాలనిగానీ ఆలోచన చేయడం లేదు.

తీర్మానం చేసినా కానరాని చర్యలు..

మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్ పక్కనే ఉన్న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు 16 టేలాలను అక్రమంగా ఏర్పాటు చేశారు. ఒక్కో టేలా నుంచి నెలకు రూ.4 వేల నుంచి రూ. 6 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. 16 టేలాల నుంచి నెలకు సుమారు 70 వేల వరకు అద్దెను జెడ్పీ పాఠశాలకు లేదా మున్సిపాలిటీకి చెల్లించాలి. కానీ టేలాలు ఏర్పాటు చేసిన లీడర్ల జేబుల్లోకి వెళ్తోంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం మున్సిపల్ సమావేశంలో ఆక్రమణలపై చర్చించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు ఏర్పాటు చేసిన టేలాలను తొలగించాలని తీర్మానం చేశారు. కానీ ఇప్పటికీ అధికారులు కనీస చర్యలను తీసుకోలేదు. తీర్మానం ప్రకారం మున్సిపల్ అధికారులు వెంటనే టేలాలను తొలగించాలి. కానీ ఎన్నికల కోడ్ అంటూ మూడు నెలలు గడిపారు. కోడ్ ముగిసి నెల దాటినా టేలాల తొలగింపునకు చర్యలు తీసుకోవడం లేదు. ఇక రోడ్ల పక్కన ఉన్న మున్సిపల్ స్థలాలను కబ్జా చేసి టేలాలు, షాపులు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారుతోంది. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

షాపులు తొలగించాలని చెప్పాం



మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు ఏర్పాటు చేసిన టేలాలను వారే స్వయంగా తొలగించుకోవాలని చెప్పాం. రెండు రోజుల వ్యవధి ఇచ్చాం. వారికి వారే షాపులను తొలగిస్తే మంచిది. లేని పక్షంలో తామే షాపులను తొలగించడం జరుగుతుంది. అక్రమంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గదిని నిర్మించి, దుకాణాన్ని నిర్వహిస్తున్న వారిపైనా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి నిర్మాణాలు చేసినా, దుకాణాలు ఏర్పాటు చేసినా మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

ఎరుకలకు ఉపాధి కల్పించాలి



పాతమంచిర్యాల: నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

పాతమంచిర్యాల: ఆదివాసీ ఎరుకల కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టోకిని రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎరుకలు తమ కుల వృత్తులైన తట్టలు, బుట్టలు తయారు చేయడం, చీపుర్లు తయారు చేయడం, ఎరుకల నాంచారమ్మ సోదీ చెప్పడం, పందులను పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వల్ల వారికి జీవనోపాధి కరువైందన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం ఎరుకల జీవన స్థితిగతులను గమనించి, ఐటీడీఏ ద్వారా సంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరుకల సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవులు, లోకల్ బాడి ఎన్నికలలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. పందుల పెంపకం కోసం షెడ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జిల్లా కేంద్రంలో ఎరుకల ఆత్మగౌరవ భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాబు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కూతాడి రాజు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బిజిలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకలకు వివక్షత లేకుండా సంక్షేమ ఫలాలు అందించాలి

బెల్లంపల్లి: ఎరుకలకు సంక్షేమ ఫలాలను వివక్షత లేకుండా అందించాలని ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టోకిని రాజు అన్నారు. బెల్లంపల్లిలోని ఏఎంసీ క్రీడా మైదానం ఆవరణలో శనివారం ఎరుకల సంఘం మండల కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల్లో ఎరుకలు అత్యంత దయనీయస్థితిలో ఉన్నారని, ఐటీడీఏ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందడం లేదని అన్నారు. ఇతర ఎస్టీలకు అందుతున్న మాదిరిగా ఎరుకల కులస్తులను అణగద్రొక్కుతున్నారని పేర్కొన్నారు. గిరిజనులందరికీ సమయంగా సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఎరుకల కులస్తులు సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఏకగ్రీవంగా మండల కమిటీ..

ఆదివాసీ ఎరుకల సంఘం బెల్లంపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీరాముల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల మల్లేష్, కోశాధికారిగా సుల్తాన్ సంతోష్, ఉపాధ్యక్షులుగా రేవెల్లి రాయమల్లు ఎన్నికయ్యారు. వీరికి పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సుభాష్, హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యా.. ఆసరా ఇవ్వరా?

- దివ్యాంగ వృద్ధుల ఆవేదన



భర్త రాజయ్యతో బుచ్చక్క

వేమనపల్లి: అయ్యా చూడడానికి కళ్లు లేవు.. నిలబడడానికి నడుము లేదు.. నా ముసల్ది నాకు మంచి చెడు చూసుకుంటే.. దాని నీడన బతుకుతున్నా.. మానవతామూర్తులు తనకు ఆసరా అందించండి అంటూ వేమనపల్లి మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ వయోవృద్ధుడు తలండి రాజయ్య–బుచ్చక్క వేడుకున్నారు. వారికి గ్రామంలో బంధువులు ఉన్నా వీరి అవిటితనాన్ని లెక్కచేయక కుటుంబం వైపు కన్నెత్తి చూసే వారు లేరు. కొడుకు పోశం మానసిక దివ్యాంగుడు కాగా ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఒక గుడిసె, నాలుగు పశువులు, కొద్దిపాటి భూమి వీరికున్న ఆస్తి. రాజయ్య నడుం పని చేయక, కళ్లు కనబడక మంచానికే పరిమితమయ్యాడు. వృద్ధురాలైన బుచ్చక్క భర్త మంచం వద్దకు తీసుకొచ్చి అన్ని అందజేస్తూ భర్త సేవే పరమావదిగా బతుకుతుంది. ఉన్న నాలుగు పశువులు ఆమెకు ఉన్న చుట్టాలు. వాటిని మేతకు తీసుకెళ్లడం ఆమెకు తెలిసిన దినచర్య. కొద్దిపాటి భూమితో వచ్చే రూ.8వేల కౌలు, 12కిలోల రేషన్ బియ్యం వారి జీవనాధారం. గ్రామంలో బంధువుల నుంచి ఎలాంటి సహకారం లేని ఈ దివ్యాంగ వయోవృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆసరా పింఛన్ లేదు. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వీరికి సహాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఎస్సీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో గల ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను సందర్శించి, హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో మెనూ ప్రకారం పిలలకు భోజనం అందించడం లేదని, తాగునీటి సౌకర్యం లేదని, ఆహార వ్యవస్థ దారుణంగా ఉందన్నారు. గదుల్లో అపరిశుభ్రత, బాత్రూమ్‌లు సక్రమంగా లేక మురికి కుంటలను తలపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ, ఇన్‌చార్జి తోట అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి నాగుల రాజన్న, కల్లెపల్లి నవీన్, కామెర అర్జున్, ఎరుకల నర్సింగ్, దేవరకొండ వెంకన్న, బీజేపీ పట్టణ కార్యదర్శి రెడ్డిమల్ల అ శోక్, ఎస్సీ మోర్చా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కన కం శ్రీనివాస్, జనగామ శివరామకృష్ణ పాల్గొన్నారు.

అబాకస్‌లో గ్రాండ్ పట్టా అందుకున్న జయంత్‌వర్మ



గ్రాండ్ పట్టా అందజేస్తున్న ఏఏఏ అబాకస్ సంస్థ వ్యవస్థాపకుడు గంగాధర్

మంచిర్యాలఅర్బన్: జగిత్యాల్ ఏఏఏ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గణితంలో (అబాకస్) ప్రతిభ కనబరిచిన స్థానిక రివిలేషన్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి జయంత్ వర్మ శనివారం సంస్థ వ్యవస్థాపకుడు గంగాధర్ చేతుల మీదుగా గ్రాండ్ మాస్టర్ పట్టా అందుకున్నారు. జయంత్ వర్మ సంవత్సర కాలంగా ఏఏఏ అబాకస్ సంస్థ ద్వారా ఆన్‌లైన్ తార్ఫీదు పొందారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అబాకస్ చేతి వేళ్ల ద్వారా సులభమైన రీతిన తీసివేత, గుణాకార భాగాహారాలశు టక్కున చెప్పసాగారు. అంగులియా అబాకస్‌లో గ్రాండ్ మాస్టర్ కోర్సు పూర్తి చేయటంతో గంగాధర్ పట్టా అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రావు జయంతి వర్మను అభినందించారు.

క్యాన్సర్ అవగాహనపై స్కూటీ ర్యాలీ



స్కూటీపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్: వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ క్యాన్సర్ అవగాహన స్కూటీ ర్యాలీని శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు నిర్వహించి, ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. జెట్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆస్ట్రేలియా మెల్బోర్న్ రామడుగు సత్య వారి సహకారం, జెడ్ వికాస తరంగిణి గ్రీన్ సిటీ శాఖ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. ఆదివారం రోజున మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంజుబాషిని, హనుమంతరావు, నరసింహారావు, కృష్ణారావు, మాధవి, రవీంద్ర, ఉషాక్రాంతి, రాజేశ్వర్‌రావు, బాలకిషన్‌రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయంలో మద్యం పార్టీ



ఐకేపీ ఏపీఎంను నిలదీస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని: మండల కేంద్రంలోని భరతమాత మండల సమాఖ్య(ఐకేపీ) కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఐకేపీ ఏపీఎం ప్రకాష్‌తో కలిసి వీఏఓలు కొందరు మందు పార్టీ చేసుకుంటున్నారని సమాచారం తెలియడంతో మండల కాంగ్రెస్ నాయకులు అక్కడికి వెళ్లారు. వెంటనే స్థానిక పోలీసులకు శుక్రవారం రాత్రి 9గంటలకు సమాచారం అందించారు. దీంతో కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులకు, మద్యం పార్టీలో ఉన్న ఐకేపీ సిబ్బందికి వాగ్వాదం చోటు చేసుకుంది. తాము వచ్చే సరికి ఐకేపీ ఏపీఎం, వీఏఓలు మందు సీసాలను కార్యాలయం కిటికీల నుంచి బయటకు విసిరేసినట్లు, మద్యం సీసాలను, తినుబండారాలను సైతం అక్కడికి వచ్చిన పోలీసులకు కాంగ్రెస్ నాయులు చూపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఫోన్ ద్వారా తాండూర్ సీఐ కుమారస్వామి, స్థానిక ఎస్సై విజయ్‌కుమార్‌లకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా కాంగ్రెస్ నాయకులు ఇచ్చి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

జన్నారం: నూతనంగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైనా నగరి ప్రీతంను జన్నారం మండల దళిత సంఘాల నాయకులు హైదరబాద్‌లో శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాలతో సన్మానించారు. ఎస్సీ కులస్తుల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జన్నారం మండలానికి చెందిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేశ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఇందయ్య, జిల్లా నాయకుడు బానేశ్, ప్రశాంత్, ప్రవీణ్, జైకుమార్, నిశాంత్ తదితరులున్నారు.

'కాంట్రాక్టర్లవి అసత్య ఆరోపణలు'

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సివిల్ కాంట్రాక్టర్లపై గోదావరిఖనికి చెందిన సతీశ్‌కుమార్, ఇతర కాంట్రాక్టర్లు చేసిన ఆరోపణలు అసత్యాలని శ్రీరాంపూర్ ఏరియా కాంట్రాక్టర్లు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు పీ. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పీ. రాంరెడ్డి మాట్లాడారు. దురుద్దేశపూర్వకంగా తమపై ఆరోపణలు చేశారన్నారు. చిన్న కాంట్రాక్టర్ల పొట్టకొట్టే విధంగా వారు వ్యవహరించారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీ. స్వర్ణాకర్‌తో పాటు బక్క శ్రీనివాస్, కుమారస్వామి, రాజు, శ్రీనివాస్, గోపాల్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రక్తకణాల దానం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వేమనపల్లి మండలం బయ్యారం గ్రామానికి చెందిన 8 ఏళ్ల వీర్ల గౌతమికి రక్తకణాలు తగ్గి, మంచిర్యాల ప్రభు త్వ జనరల్ ఆసుపత్రిలో ఉండగా, క్యాతన్‌పల్లికి చెందిన మనం ఫౌండేషన్ సభ్యుడు బి. రాజ్‌కుమార్ రక్తకణాలను దానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సొసైటీ బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు మధుసూధన్‌రెడ్డి, టెక్నికల్ సూపర్‌వైజర్ విజయ్ కుమార్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన అక్కల చిన్నయ్య వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.2.50లక్షల ఎల్‌వోసీని శనివారం చిన్నయ్య కుటుంబ సభ్యులకు అందించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చెన్నూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. చెన్నూర్ మండలంలోని బుద్దారం, సంకారం, కన్నెపల్లి, చింతలపల్లి అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాలలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఇందుకు అయ్యే వ్యయం అంచనా వేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఏడీ రవికుమార్‌కు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుతో పాటు లో ఓల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, నాయకులు రాజమల్లాగౌడ్, బాపగౌడ్, సూర్యనారాయణ, హిమవంతరెడ్డి, మహేశ్‌ప్రసాద్ తివారి, పోగుల సతీశ్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, కొంపల్లి బానేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే.. ఆదరణ

- ముత్యంపేటలో బ్రహ్మంగారి ఆలయం



వీరబ్రహ్మేంద్రస్వామి

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటలో కొలువుదీరిన భూత, భవిష్యత్, వర్తమాన, కాలజ్ఞాన ప్రధాత, సృష్టికర్త, జగద్గురు శ్రీ మద్విరాట్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం దాతల సహకారంతోనే దశలవారీగా అభివృద్ధి చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. కనీసం దూపదీప నైవేద్య పథకం కూడా ఆలయానికి వర్తించడం లేదు. సుమారు 50 యేళ్ల క్రితం గ్రామంలో చిన్న ఆలయాన్ని నిర్మించారు. ప్రభుత్వ పరంగా ఆలయానికి నిధులు మంజూరు చేస్తే, ఆలయానికి మరింత ఆదరణ లభించనుంది.

ఆలయ ప్రాశస్త్యం ఇదీ..

సుమారు 50ఏళ్ల క్రితం గ్రామంలో బ్రహ్మంగారి బుర్రకథ చెప్పే సమయంలో ఆ ప్రాంతలో ఉన్న చింతచెట్టు పడిపోయింది. ఐదు రోజుల్లో కథ ముగిసే రోజు నాటికి పడిపోయిన చెట్టు.. దానికదే మళ్లీ లేచి నిలబడింది. దీంతో ఇది బ్రహ్మంగారి మహిమ అని గ్రామస్తులు భావించారు. అక్కడ చిన్నగా బ్రహ్మంగారి చిత్రపటాన్ని పెట్టి పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మల్లయ్య అనే ఓ భక్తుడు, దాతల సహకారంతో అక్కడ చిన్న ఆలయాన్ని నిర్మించాడు. 1991లో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. గ్రామస్తులు, చందాలు వేసుకుని, ఆలయాన్ని కొంత అభివృద్ధి చేస్తున్నారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు, దూపదీప నైవేద్య పథకం వర్తింపజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు సారంగపల్లిలో మెడికల్ క్యాంపు

మందమర్రిరూరల్: మండలంలోని సింగరేణి పరిసర ప్రాంతమైన సారంగపల్లిలో సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక



ఎంపిక పత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి

చెన్నూర్: పట్టణంలోని భవన నిర్మాణ తాపి కార్మిక భవన్‌లో శనివారం లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నెన్నెల రాజన్న, ఉపాధ్యక్షుడిగా బైరం చిన్నపోశం, కార్యదర్శిగా కుడికాల సంతోష్, డైరెక్టర్స్‌గా చెడె అశోక్, నెన్నెల సత్యం, బొడ్డు రాజు, డేగల రాజశేఖర్, చెన్న శివకుమార్, పోగుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారికి ఎన్నికల అధికారి ఎంపిక పత్రాలు అందించి అభినందించారు.